# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక




## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

–జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:– 9705770909 సంప్రదించండి.



సంచిక : 83 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శనివారం | 21-6-2025 | వెల : .రూ. 5.00/-

# చంద్రబాబుతో చర్చలకు సిద్ధం




## జలవివాదాలు చర్చలతోనే పరిష్కారం

- దీనిపై 23న మంత్రివర్గంలో నిర్ణయం
- ఏపీ, తెలంగాణ మధ్య పంచాయితీలు వద్దు
- ఏపీకి గోదావరి జలాలను మామా, అల్లుళ్లే రాసిచ్చారు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్

**చంద్రబాబును ఆహ్వానిస్తాం**

**న్యూఢిల్లీ జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జల వివాదాల పరిష్కారం కోసం ఒక అడుగు ముందుకేసి ఆంధ్రప్రదేశ్ (ఏపీ) ప్రభుత్వాన్ని చర్చలకు ఆహ్వానిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నీటి పంచాయితీలు వద్దనేదే తమ విధానమని స్పష్టం చేశారు. ఏ సమస్య అయినా కూర్చుని మాట్లాడుకుంటేనే పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈనెల 23న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించి -మిగతా 2 లో



# గీత దాటితే చర్యలు తప్పవు

- ఒకరి శాఖల్లో మరొకరు జోక్యం చేసుకోవద్ద
- జూబ్లీహిల్స్‌లో అభ్యర్థి నిలబెడతాం..
- డీసీసీ నివేదిక తర్వాత చర్యలు
- విలేకర్ల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గీతదాటితే చర్యలు తప్పవని, పార్టీ నిబంధనలు ఉల్లంఘించి మాట్లాడితే సహించేది లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఒకరి శాఖల్లో మరొకరు జోక్యం చేసుకోవద్దని రాష్ట్ర మంత్రులకు తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికలపై మాట్లాడటం సరికాదని మంత్రి పొంగులేటికి స్పష్టం చేయడంతో.. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకే అలా మాట్లాడినట్టు ఆయన వివరణ ఇచ్చారని వెల్లడించారు. -మిగతా 2 లో



# ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించిన మోదీ

- మహాప్రభువు భూమికి వెళ్లడం నాకు చాలా ముఖ్యం.
- జగన్నాథుడి కోసం ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించ

**భువనేశ్వర్ జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికా సందర్శించాలన్న ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని తాను తిరస్కరించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. పవిత్ర మహాప్రభు భూమికి తిరిగి రావాలన్న ఉద్దేశంతో అలా చెప్పానన్నారు. శుక్రవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన బీజేపీ తొలి ప్రభుత్వ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. -మిగతా 2 లో

# సన్న వడ్ల బోనస్‌పై సన్నాయి నొక్కులేనా..!

## సన్న వడ్ల బోనస్ కూడా బోగస్ అయింది..

- యాసంగిలో సన్నాల కొనుగోలు పూర్తయినా రూ. 1,161 కోట్లు బోనస్ ఇంకా విడుదల చేయకపోవడం దుర్మార్గం
- అడుగడుగునా ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం బయటపడుతోంది.
- రైతు కూలీల పరిస్థితి అయితే అధోగతే.
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



**హైదరాబాద్ జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సన్న వడ్ల బోనస్ కూడా బోగస్ అయింది.. సన్న వడ్ల బోనస్‌పై సన్నాయి నొక్కులేనా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. యాసంగిలో సన్నాల కొనుగోలు పూర్తయినా రూ. 1,161 కోట్లు బోనస్ ఇంకా విడుదల చేయకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. 4.01 లక్షల మంది రైతుల నుంచి 23.22 లక్షల టన్నుల సన్నాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బోనస్ చెల్లించలేదు. రాష్ట్రంలో పొద్దు తిరుగుడు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. సన్ ఫ్లవర్ కొనుగోలు పూర్తయి 75 రోజులు దాటినా కూడా రైతుల ఖాతాలో -మిగతా 2 లో



# ఇంగ్లీష్‌తో సాధికారత.. సిగ్గుచేటు కాదు

- ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పించాలి
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇంగ్లీష్ భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఆ వ్యాఖ్యలకు శుక్రవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. ఇంగ్లీష్ సిగ్గుపడే భాష కాదు అని, అది సాధికారతను కల్పించే భాష అన్నారు. ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పించాలని రాహుల్ అభిప్రాయపడ్డారు. కానీ బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఆ భాషను పేద పిల్లలు నేర్చుకోకుండా చేస్తోందని, -మిగతా 2 లో



# యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం


- అది ప్రతిఒక్కరి జీవితంలోనూ భాగస్వామ్యం కావాలి
- ఎల్బీ స్టేడియంలో జరిగిన యోగా కౌంట్‌డౌన్ వేడుకల్లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

**హైదరాబాద్**
యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. అది ప్రతి ఒక్కరి జీవితంలోనూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. యోగా దినోత్సవం శనివారం జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో యోగా 24 గంటల కౌంట్‌డౌన్ వేడుకలను నిర్వహించారు. -మిగతా 2 లో

# బలపడుతున్న రుతుపవనాలు

- వచ్చే నాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు వాతావరణ శాఖ అంచనా


**హైదరాబాద్ జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రుతుపవనాలు బలపడుతుండటంతో రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. తెలంగాణ, -మిగతా 2 లో



# అమెరికా అనుమతి కోసం ఎదురుచూడం

- ఇరాన్ అణు స్థావరాలన్నీ ధ్వంసం చేస్తాం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటన

**న్యూఢిల్లీ, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమతో చేతులు కలిపినా కలపకున్నా ఇరాన్‌లోని అణు స్థావరాలన్నిటినీ ధ్వంసం చేసే సామర్థ్యం తమ దేశానికి ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం ప్రకటించారు. ఫోర్డోలోని భూగర్భ అణు స్థావరంతో సహా ఇరానియన్ స్థావరాలపై దాడి చేసే ముందు అమెరికా నుంచి అనుమతి -మిగతా 2 లో



# చంద్రబాబుతో చర్చలకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఢిల్లీలో శుక్రవారంనాడాయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై మాట్లాడుతూ సముద్రంలో కలిసే గోదావరి జలాల విషయంలో వాస్తవాలు, రాజకీయాలు ముడిపడి ఉన్నాయని చెప్పారు. సముద్రంలో కలిసే జలాలపై ఏపీ, తెలంగాణ కూర్చుని మాట్లాడుకుంటే పరిష్కారం అయ్యేదన్నా రు. కానీ తెలంగాణ ప్రభుత్వాన్ని సంప్రదించ కుండా, ఏపీ సర్కార్ కేంద్రం దగ్గరకు వెళ్లడం బీఆర్‌ఎస్‌కు రాజకీయ ఆయుధంగా మారిందన్నా రు. ఏపీ విభజన చట్టం-2014లో రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారం కోసం అపెక్స్ కౌనిల్స్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీనిపై ఇరు రాష్ట్రాల అధికారులు, మంత్రుల కమిటీ కూడా ఉందని చెప్పారు. వీటిని కాదని ఏపీ సీఎం చంద్రబాబు గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ఫీజుబిలిటి, డీపీఆర్‌తో కేంద్రం చుట్టూ తిరగడంతో అసలు వివాదం మొదలైందన్నారు. రెండు తెలుగు ప్రాంతాలు మధ్య నెలకొన్న వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ఏ సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం అవుతుందన్నారు. అనవసరమైన వివాదాలు తమకు ఇష్టం లేదని చెప్పారు. కృష్ణా-గోదావరి జలాలపై కర్ణాటక, మహారాష్ట్రతో మాట్లాడేందుకు ఏపీతో కలిసి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని గుర్తు చేశారు.

**మనమే పరిష్కరించుకుందాం**

ప్రాజెక్టుల వారీగా చర్చించి, న్యాయ, సాంకేతిక పరంగా సమస్యల్ని పరిష్కరించుకుందామని ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సంప్రదింపుల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు తాము సిద్ధమేననీ, అయితే ఎవరి కోసమో తెలంగాణ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీటి పంపకాల అంశం గత పదేండ్లలో మరింత జటిలమయ్యాయన్నారు. రాష్ట్రానికి నీటి కేటాయింపులు తేలితే, మిగిలిన అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఏపీ సర్కార్‌కు తాము పంపే ఆహ్వానంపై బీఆర్‌ఎస్ చేయబోయే విమర్శలకు భయపడేది లేదన్నారు.

**మామా, అల్లుళ్ళే కారణం..**

గోదావరి జలాలను ఆంధ్రకు రాసిచ్చిందే మామా, అల్లుళ్లు(కేసీఆర్, హరీష్ రావు) అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పోలవరం నుంచి గోదావరి వరద జలాలను ఏపీకి తరలించ డానికి బీఆర్‌ఎస్ హయాంలోనే పునాది పడిందన్నారు. కేసీఆర్ అంగీకారం తెలపడంతో 2016, 2018లో వరద జలాలను ఏపీకి తరలించడానికి ఆనాడు అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్ రెండు జీవోలను విడుదల చేసిందంటూ వాటి ప్రతుల్ని మీడియాకు చూపారు. సముద్రంలో కలిసే 400 టీఎంసీలను పోలవరం నుంచి పెన్నా బేసిన్‌లోని సోమశిలకు మళ్లించడాని కి అవకాశం ఉందని వ్యాప్కోస్ కన్సల్టెన్సీ సంస్థ ఏపీ ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చిందన్నారు. అయితే ఆనాడు పెన్నా బేసిన్ అని చెప్పినా, నేడు బనకచర్ల అంటున్నా రెండూ ఒకటేనని చెప్పారు. ఆ తర్వాతే ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డితోనూ కేసీఆర్ గోదావరి జలాల వినియోగానికి చర్చలు జరిపారన్నారు. ఈ అంశంపై జగన్‌తో కేసీఆర్ నాలుగుసార్లు భేటీ అయ్యారని తెలిపారు. తెలంగాణ సీఎం హోదాలో ఏపీలో పర్యటించి రాయలసీమను రత్నాల సీమను చేస్తానంటూ గోదావరి జలాల మళ్లింపునకు బహిరంగంగానే అంగీకారం తెలిపారని వివరించారు.

**బీఆర్‌ఎస్‌వి మోసపూరిత నినాదాలు**

నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ మోసపూరిత నినాదాలను అడ్డంపెట్టుకొని బీఆర్‌ఎస్ పార్టీ ఇన్ని రోజులు బతికిందన్నారు. ప్రస్తుతం చచ్చిపోయిన పార్టీని బతికించుకునేందుకు గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఆ పార్టీ సంజీవనిలా భావిస్తోందని చెప్పారు. జలాల పేరుతో మరోసారి రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టి సెంటిమెంట్ రగల్చాలని బీఆర్‌ఎస్ చూస్తోందన్నారు. 10 ఏండ్ల పాలనలో తెలంగాణ ప్రాజెక్ట్‌ల విషయంలో బీఆర్‌ఎస్ ఏం వెలగబెట్టిందో చెప్పాలన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో చేపట్టిన ప్రాజెక్టు లకు పేరు, ఊరు, అంచనాలు మార్చారన్నారు. దోచుకునేందుకు ఈ పనులు చేశారని ఆరోపించారు.

**దేవుడే ఆశ్చర్యపోతాడు**

బీఆర్‌ఎస్ నేతల అబద్ధాలకు దేవుడు కూడా ఆశ్చర్య పోతాడని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శివుడి తల నుంచి నేరుగా ఎర్రవల్లి ఫాంహౌజ్‌కు గంగను దించాననీ, అక్కడి నుంచే నదులు పుట్టాయని కూడా కేసీఆర్ చెబుతారన్నారని ఎద్దేవా చేశారు. 2029 ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు మోడీకి చంద్రబాబు నాయుడు అవసరం ఉందన్నారు. అలాగే చంద్రబాబు నాయుడుకు గోదావరి వరద జలాలు అవసరమనీ, తెలంగాణలో పార్టీని బతికించుకోవడానికి బీఆర్‌ఎస్‌కు పోలవరం-బనకచర్ల అవసరమన్నారు. అందుకే వీరంతా కలిసి కాంగ్రెస్‌ను, తనను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని చెప్పారు.

**299 టీఎంసీలకు ఒప్పుకుందే మీరు కాదా ?**

%కృష్ణా నదీ జలాల్లో 811 టీఎంసీలకు గాను, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకు ఒప్పుకుంటూ సంతకం చేసింది మాజీ మంత్రి హరీశ్‌రావే అని తెలిపారు. 2020 జనవరిలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) 11వ సమావేశంలోనూ తెలంగాణకు 299 టీఎంసీలు చాలంటూ ఒప్పుకున్నారన్నారు. అలాగే కేంద్ర జలశక్తి మంత్రి నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోనూ కేసీఆర్, హరీశ్‌లు ఈ కేటాయింపు లకే కట్టుబడి రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు మేల్కొన్న హరీశ్‌రావు, 299 టీఎంసీల ఒప్పందంతో తెలంగాణ కు అన్యాయం జరుగుతోందని ఆనాటి జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాసారన్నారు. ఇందులో 2015లో జరిగిన ఒప్పందంతో తెలంగాణకు ఉరి అని ఒప్పుకున్నారని అన్నారు. అందువల్ల 811 టీఎంసీల్లో 50:50 నిష్పత్తిలో కేటాయింపులు చేయాలని కోరినట్లు చెప్పారు. కానీ తాము కృష్ణా నదిలో నదిలో 500 టీఎంసీలు బ్లాంకెట్‌గా ఇవ్వాలని కోరుతుంటే హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారన్నారు. ఆయన లెక్క ప్రకారం 50:50 నిష్పత్తిలో పంపకాలు చేసినా తెలంగాణకు వచ్చేది దాదాపు 405 టీఎంసీలే అన్నారు. అంటే హరీశ్‌రావు కన్నా తాము 100 టీఎంసీలు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నామని వివరించారు.

**కాళేశ్వరానికి రూ.96 వేల కోట్లు చెల్లించాం**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు ఇప్పటి వరకు రూ.1,27,872 కోట్ల టెండర్లు పిలవగా, రూ. 95,902 కోట్లు చెల్లించినట్లు సీఎం వెల్లడించారు. ఇంకా రూ.50 వేల కోట్ల పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అన్ని కాంపోనెంట్స్ పూర్తి కావాలంటే ప్రాజెక్ట్ వ్యయం రూ. 2 లక్షల కోట్లు చేరుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో కేవలం ఒకే సీజన్‌కు 50 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందిందని చెప్పారు.

# సన్న వడ్ల బోనస్‌పై సన్నాయి నొక్కులేనా..!

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులు జమ కాకపోవడం రైతుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అద్దం పడుతున్నది. ఒక సిద్దిపేట జిల్లాలోనే 50 శాతం రైతులకు డబ్బులు ఇవ్వలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సన్‌ఫ్లవర్ రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పంట కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వేస్తామని ప్రగల్బాలు పలికిన మంత్రి గారు. రెండు నెలలు దాటినా ఇప్పటికీ రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం శోచనీయం. వెంటనే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 1,116 కోట్ల సన్నాల బోనస్ డబ్బులతో పాటు సన్ ఫ్లవర్ రైతులకు పంట కొనుగోలు డబ్బులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతులను గోస పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ప్రతీచోట రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు అబద్ధపు హామీలు, గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన మీరు, పాలన కూడా అదే అబద్ధాలతో నడిపిస్తున్నారు. అడుగడుగునా ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం బయటపడుతోంది. రుణమాఫీ 50 శాతం రైతులకి కూడా అందలేదు. పోయిన వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టారు. యాసంగిలో రైతు భరోసా సగం మందికి కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు 15 వేల రైతు భరోసా అని చెప్పి మాట తప్పి 12,000కి పరిమితం చేశారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా అని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రైతు కూలీల పరిస్థితి అయితే అధోగతే. ఎన్నికల హామీల్లో అన్ని పంటలకు బోనస్ అని చెప్పి రైతులను మభ్యపెట్టి ఇప్పుడేమో సన్నాలకి పరిమితం చేసి ఆ సన్నాలకు కూడా ఎగనామం పెట్టారు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా, యాసంగిలో కొనుగోలు చేసిన సన్నాలకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం బోనస్ చెల్లించకపోవడం రైతులను వంచించడమే. ఎంతో కష్టపడి పంట పండించినా, అది ప్రభుత్వ కొనుగోళ్లు లేక దళారుల పాలవుతోంది. కొనుగోలు చేసిన పంటలకు డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం రైతులను మరింత దయనీయ స్థితికి నెడుతున్నది. యాసంగిలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రశ్నిస్తే తప్ప కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాని దుస్థితి. ఈ ప్రభుత్వ చేతగానితనం, నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. పంట పెట్టుబడి సహాయం అందించడంలో వైఫల్యం. పండించిన పంటకు గిట్టుబాటు ధర కేటాయించడంలో వైఫల్యం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో వైఫల్యం. ధాన్యం కొనుగోలు చేయడంలో వైఫల్యం. కొన్న ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రాష్ట్రంలో కొనుగోలు చేసిన సన్ ఫ్లవర్ పంటకు డబ్బులు విడుదల చేయాలని, అదేవిధంగా సన్నాలకు బోనస్ డబ్బులు కూడా విడుదల చేయాలని బీఆర్‌ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# బలపడుతున్న రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో వర్షం కురిసే సమయంలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. తెలంగాణతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమలో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

బంగాళాఖాతంలోని ఆవర్తన ప్రభావంతో తెలంగాణలో పశ్చిమ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయని, వీటి ప్రభావంతో శుక్రవారం అక్కడక్కడ ఉరుములు మెరుపులతో తేలికపాటి వర్షాలు కురిశాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం కూడా ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ,



సూర్యాపేట, మహబూబాబాద్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడవచ్చని అంచనా వేసింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

**గడిచిన 24 గంటల్లో ..**

గడిచిన 24 గంటల్లో నిర్మల్ జిల్లా నిర్మల్ మండల కేంద్రంలో అత్యధికంగా 2.82 సెం.మీ వర్షపాతం నమోదైంది. నిర్మల్ రూరల్‌లో 1.93 సెం.మీ, సారంగపూర్‌లో 1.02 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా సత్నాలలో 1.33 సెం.మీ, ఇచ్చోడలో 1.02 సెం.మీ, నిజామాబాద్ జిల్లా నవీపేటలో 1.32 సెం.మీ, మెండోరాలో 1.01 సెం.మీ, నిజామాబాద్ సౌత్‌లో 0.98 మి.మి చొప్పున వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

# గీత దాటితే చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

**జూబ్లీహిల్స్‌లో అభ్యర్థి నిలబెడతాం..**

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం వల్ల జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెడతామని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో నిలబడే కాంగ్రెస్ అభ్యర్థిని తానేనని మాజీ క్రికెటర్, మాజీ ఎంపీ అజారుద్దీన్ ప్రకటించుకోవడంలో తప్పేమీ లేదని తెలిపారు. ఆ సీటు అభ్యర్థిగా ఎవరు ప్రకటించుకున్నప్పటికీ అది వారి వ్యక్తిగతమేనని, పద్ధతి ప్రకారం దరఖాస్తుల స్వీకరణ తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానమే అభ్యర్థిని ఎంపిక చేస్తుందని స్పష్టత ఇచ్చారు.

**డీసీసీ నివేదిక తర్వాత చర్యలు**

వరంగల్ కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితుల పై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని పరిశీలకులకు సూచించినట్టు చెప్పారు. ఆ రిపో ర్టు ఆధారంగా డీసీసీ నివేదిక ఇస్తుందని, దా ని ఆధారంగా క్రమశిక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

# ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించిన మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడకు రావడం కోసమే అమెరికా సందర్శించాలన్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని తాను తిరస్కరించినట్లు తెలిపారు.కాగా, రెండు రోజుల క్రితం జీ7 శిఖరాగ్ర సమావేశం కోసం తాను కెనడాలో ఉన్నట్లు మోదీ తెలిపారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు ఫోన్ చేసినట్లు చెప్పారు. 'మీరు కెనడా వచ్చారు కాబట్టి, వాషింగ్టన్‌కు రండి. మనం కలిసి విందు చేసి మాట్లాడుకుందామని ఆయన అన్నారు. అయితే ట్రంప్ ఆహ్వానానికి నేను ధన్యవాదాలు చెప్పా. మహాప్రభువు భూమికి వెళ్లడం నాకు చాలా ముఖ్యం. అందుకే ట్రంప్ ఆహ్వానాన్ని మర్యాదగా తిరస్కరించా. మహాప్రభు పట్ల మీకున్న ప్రేమ, భక్తి ఈ భూమికి నన్ను తీసుకువచ్చాయి' అని మోదీ అన్నారు.

# ఇంగ్లీష్‌తో సాధికారత..సిగ్గుచేటు కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకంటే ప్రశ్నించడం వాళ్లకు ఇష్టం ఉండదని, సమానత్వాన్ని వాళ్లు కోరుకోవడం లేదని రాహుల్ అన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో హిందీ భాషలో రాహుల్ గాంధీ ఇవాళ ఓ పోస్టు చేశారు. ఇంగ్లీష్ భాష ఆనకట్ట కాదు అని, అదో వారధి అన్నారు.ఇంగ్లీష్ నేర్చుకోవడం సిగ్గుచేటు కాదు అని, అది సాధికారత ఇస్తుందన్నారు. ఇంగ్లీష్ గొలుసు కాదు అని, అది గొలుసుల్ని బ్రేక్ చేసే పరికరం అన్నారు. భారత దేశ పేద ప్రజలు ఇంగ్లీష్ నేర్చుకోవద్దన్న ఆలోచనలో బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ ఉన్నట్లు రాహుల్ ఆరోపించారు. మాతృభాష తరహాలోనే ఇంగ్లీష్ భాష ముఖ్యమైందని, ఎందుకంటే అది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తుందన్నారు. ప్రతి భారతీయ భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని ఆదరించాలని, అదే సమయంలో ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పాలన్నారు. ప్రపంచంతో పోటీపడాలంటే ఇండియాకు ఇదో మార్గమని, ఇది ప్రతి పిల్లవాడికి సమాన అవకాశం కల్పిస్తుందన్నారు.

# యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

(మొదటి పేజీ తరువాయి)

అందులో మాజీ రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎంపీ ఈటల రాజేందర్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ జాతీయ నేత ఖుష్బూ, సినీ నటులు సాయి దుర్గాతేజ్, తేజా సజ్జ, మీనాక్షి చౌదరి, తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు. యోగ ఆవశ్యకత గురించి చెప్పారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన అద్భుత బహుమతి యోగా అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు, ఆ దేశాధినేతలు, ఆ దేశాల ప్రభుత్వాల ఆధ్వర్యంలో యోగాను గుర్తించి, ఆచరిసున్నారని గుర్తుచేశారు. ఇది ప్రతి భారతీ యుడు గర్వించదగిన అంశమని చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సంద ర్భంగా శనివారం విశాఖ పట్నంలో ఐదు లక్షల మందితో కలిసి యోగాలో పాల్గొ నబోతున్నందుకు సంతోషంగా ఉందన్నా రు. యోగానే ప్రథమ డాక్టర్ అనీ, సర్వరోగ నివారిణి అని నొక్కి చెప్పారు. యోగా పాటించినట్లయితే జీవితంలో మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. యోగాను ప్రతిఒక్కరూ ఆచరించాలని కోరారు.

# అమెరికా అనుమతి కోసం ఎదురుచూడం

(మొదటి పేజీ తరువాయి)



కోసం ఎదురు చూడబోమని కూడా ఆయన స్పష్టం చేశారు.ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలో తమ చేరికపై అమెరికా నుంచి ఇంకా స్పష్టమైన నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నెతన్యాహు తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మా లక్ష్యాలన్నిటినీ సాధిస్తాం. ఇరాన్‌లోని అన్ని అణు స్థావరాలపై దాడి చేస్తాం. అందుకు అవసరమైన సత్తా మాకు ఉంది అని నెతన్యాహు తెలిపారు.

**2025 జూన్ 21, శనివారం తెలుగు పంచాంగం**




**మాసం - పక్షం**
మాసం: జ్యేష్ఠమాసం (అమాంత)
పక్షం: కృష్ణపక్షం
**తిథి**
త్రయోదశి: జూన్ 20, రాత్రి 4:08 నుండి జూన్ 21, రాత్రి 4:52 వరకు
చతుర్దశి: జూన్ 21, రాత్రి 4:52 నుండి జూన్ 22, రాత్రి 5:36 వరకు
**నక్షత్రం**
ఉత్తరాషాఢ: జూన్ 20, రాత్రి 8:24 నుండి జూన్ 22, మధ్యాహ్నం 9:12 వరకు
**సూర్యోదయం - సూర్యాస్తమయం**
సూర్యోదయం: ఉదయం 5:48
సూర్యాస్తమయం: సాయంత్రం 6:49
**చంద్రోదయం - చంద్రాస్తమయం**
చంద్రోదయం: రాత్రి 6:49
చంద్రాస్తమయం: రాత్రి 8:10 (సుమారు)
**శుభ సమయాలు**
బ్రహ్మ ముహూర్తం: 4:10 AM - 4:58 AM
అభిజిత్ ముహూర్తం: 11:53 AM - 12:45ూవీ
అమృతకాలం: ఉదయం 6:33 - 8:15
**అశుభ సమయాలు**
రాహుకాలం: 9:44 AM - 11:22 AM
యమగండం: 1:59 PM - 3:37 PM
గులిక కాలం: 6:26 AM - 8:04ూవీ
దుర్ముహూర్తం: ఉదయం 6:58 - 7:50 మరియు మధ్యాహ్నం 3:58 - 4:50
వర్జ్యం: ఉదయం 6:33 - 8:15

# మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి...




**మందమర్రి జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మందమర్రి కళ్యాణి కనీ ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ మల్లవరపు శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బ్యాంకులో పొదుపు సంఘాల మహిళలకు కోటి రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. ముఖ్యంగా పొదుపు సంఘాల మహిళలు యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఇందుకోసం బ్యాంకు పరంగా మేము రుణాలను సిద్ధంగా ఉంచామని ఆయన తెలిపారు. ప్రతి నెల క్రమం తప్పకుండా తీసుకున్న రుణాలకు తిరిగి చెల్లించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టిఎంసి ఏనుగు రఘురాం, ఫీల్డ్ ఆఫీసర్ మహేందర్, మరియు బ్యాంకు సిబ్బంది నిహారిక, అశోక్, ప్రసాద్, ఆర్పీలు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజేందర్ రెడ్డికి ఘనంగా సన్మానం..

**మందమర్రి జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం డివిజన్ రెస్క్యూ కార్యాలయంలో శుక్రవారం మైన్స్ రెస్క్యూ సూపరింటెండెంట్గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను మందమరి కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువా పూల బోకే అందజేసి ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందమరి కాంగ్రెస్ నాయకులు పానుగంటి లక్ష్మణ్, మంద తిరుమల్ రెడ్డి, ఎర్ర రాజు, రాచర్ల గణేష్, రాయబారపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతి

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పణ**



**మిర్యాలగూడ, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, టై –బెల్టుల పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్నాయని, విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థి సంఘాలు సంయుక్తంగా నిర్వహించాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజులను నిర్దేశించేందుకు చర్యలు తీసుకోవాలని, పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, "ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి, పుస్తకాలు, దుస్తులు, ఇతర వస్తువుల పేరుతో తల్లిదండ్రులపై భారాన్ని మోపుతున్నాయి. ఇది విద్యా హక్కును హరించే చర్య" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఫారుఖ్, తాళ్లపల్లి సురేష్, ఇస్లావత్ సైదా నాయక్, పరంగి సురేష్, గాదగోని మహేష్ గౌడ్, లావూరి రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2025

-అంతర్జాతీయ యోగా డేకు కౌంట్‌డౌన్
-ఎల్బీస్టేడియంలో యోగాసనాలు
-వేలాది సంఖ్యలో తరలివచ్చిన జనం
-కౌంట్‌డౌన్ కార్యక్రమానికి వచ్చిన సినీ సెలబ్రిటీలు
-యోగ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎల్బీ స్టేడియం కు బయలుదేరిన షాద్ నగర్ పతంజలి యోగ సభ్యులు



**షాద్ నగర్, జూన్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2025
ఈ రోజు, కేంద్ర మంత్రివర్యులు శ్రీ కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ యోగా కార్యక్రమానికి ఎల్బీ స్టేడియం కు వేలాది మంది తరలివచ్చారు, ఈ కార్యక్రమంలో అనేకమంది సినీ సెలబ్రిటీలు కూడా పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణంలోని పతాంజలి యోగ కేంద్రం నుంచి 120 మంది యోగాభ్యాసకులు యోగా కార్యక్రమంలో పాల్గొనడానికి హైదరాబాద్ ఎల్బీ స్టేడియమ్ వైపు పయనమయ్యారు. ఈ మహోత్సవ యోగా కార్యక్రమం దేశ వ్యాప్తంగా ఆరోగ్య చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తోందని, షాద్ నగర్ నుండి బయలుదేరిన యోగ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరు ఆరోగ్యంగా ఉండండి, సమాజానికి మానసిక, శారీరక శాంతిని ప్రసాదించండని పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు హరి భూషణ్ పటేల్ కోరారు.

# వికసిత్ భారత్ రచ్చబండకు విశేష స్పందన

**-కేంద్ర పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బీజేపీ కార్యక్రమం**



**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కరీంనగర్ 50వ డివిజన్ గణేష్ నగర్‌లో బుధవారం వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జి దేవిశెట్టి నవీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విశేష స్పందన చూపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం వాసుదేవ రెడ్డి, సెంట్రల్ జోన్ కన్వీనర్ తనకు సాయికృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కూర మహిపాల్ రెడ్డి, కొలిపాక శ్రీనివాస్, జంగాలపల్లి కుమార్, సెంట్రల్ జోన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బొడ్ల శ్రీరాములు, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 11 ఏళ్లలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అనేక విజయాలను సాధించింది. ఈ విజయాలను ప్రతి గడపకు, ప్రతి వ్యక్తికి తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం" అని తెలిపారు. కేంద్ర పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి, టీఆర్ఎస్ పాలన వైఫల్యాలు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చడంలో విఫలమవుతున్న తీరును కూడా ప్రజలకు వివరించామని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద కరీంనగర్‌లో కేంద్ర నిధులతో అభివృద్ధి జరుగుతోందని, గణేష్ నగర్ బైపాస్ రోడ్డు, ఆర్వోబీ నిర్మాణం, రైల్వే స్టేషన్ ఆధునీకరణ, కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి విస్తరణ, గ్రామీణ ప్రాంతాల్లో అటల్ సడక్ యోజన కింద సీసీ రోడ్ల నిర్మాణం వంటి పలు పనులు కేంద్ర సహకారంతో జరుగుతున్నాయని వివరించారు.

# ఎస్ఎఫ్ఐ 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

**-యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి: చిట్యాల రాజు**




**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు చిట్యాల రాజు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రం కోజికోడ్‌లో జరగనున్న ఎస్ఎఫ్ఐ 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ మహాసభలు వేదికగా నిలవనున్నాయని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, యూనివర్సిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని, ఈ మహాసభలు విద్యార్థి ఉద్యమానికి దిశానిర్దేశకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు మాలోతు శివ, దీక్షిత్, వినోద్, ప్రవీణ్, మహేందర్, మల్లేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాథ రథయాత్రకు విరాళం



**కరీంనగర్, జూన్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కరీంనగర్ పట్టణంలో జూలై 5న జరగనున్న జగన్నాథ రథయాత్ర ఏర్పాట్లకు శ్రీ రామాలయం & శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ చిట్టి మల్ల శ్రీనివాస్ 11 వేల రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గురూజీ ప్రభు, కన్న కృష్ణ, కొమురవెల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య సౌకర్యాలు

**చిన్న శంకరంపేట.జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... ప్రభుత్వ బడులోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు, ప్రభుత్వ పాఠశాలలో పేద ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులు మరియు మధ్యాహ్నం వారానికి మూడు రోజులపాటు గుడ్లతో పౌష్టిక భోజనం అందించడం జరుగుతుందని అన్నారు మరియు మడూర్ గ్రామంలో నిర్వహించే భూభారతి కార్యక్రమం రెండు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# అనుమతి లేని పాఠశాలల పై చర్యలు తీసుకోవాలి

**విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండించిన యూఎస్ఎఫ్ఐ**




**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, మండల విద్యాధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం యూఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టి నిరసన చేపట్టారు. అనంతరం గేటుకు వినతిపత్రం కట్టి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. "అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలలకు గుర్తింపు ఇవ్వడం, వాటిని ప్రోత్సహించడం విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేసి, యజమాన్యాలపై కేసులు నమోదు చేయాలి," అని మాదం తిరుపతి స్పష్టం చేశారు. విద్యను వ్యాపారంగా మలుచుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని, విద్యార్థుల హక్కులను కాపాడేందుకు ఉద్యమం కొనసాగుతుందని యూఎస్ఎఫ్ఐ నేతలు పేర్కొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.

అన్నివేళలా మీతో పాటు ఉంటుంది

ఇమెయిల్: neelagiriexpress@gmail.com

సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం





**-ఊటూరు, రంగపేట, లక్ష్మీపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**మానకొండూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామాల సమగ్ర అభివృద్ధే తన ధ్యేయమని, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మానకొండూర్ మండలంలోని ఊటూరు, రంగపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రతి గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరచేందుకు వివిధ శాఖల ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నాం. చేపట్టిన పనులు నిర్దిష్ట గడువులోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం” అని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని ఆయన స్పష్టం చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను ఇప్పటికే అమలు చేశామని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. త్వరలో రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు రుణాలు, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఊటూరులో జడ్పీ నిధులతో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సైడ్ డ్రైన్, ఎన్‌ఆర్‌ఈజీఏ నిధులతో రూ.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, ఎస్సీ కాలనీలో ఎస్డీఎఫ్ నిధులతో రూ.8 లక్షలతో నిర్మించిన రోడ్లను ప్రారంభించారు. రంగపేటలో ఎన్‌ఆర్‌ఈజీఏ కింద రూ.25 లక్షలతో నిర్మించిన రోడ్డును, లక్ష్మీపూర్‌లో రూ.1.5 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మండల అభివృద్ధి అధికారి వరలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ రవిప్రసాద్, ఏఈ వెంకన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్. తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ఒలింపిక్ డే రన్

**శాట్ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత “అల్ఫోర్స్” నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ స్థాయిలో జరుపుకునే ఒలింపిక్ డే సందర్భంగా కరీంనగర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్, జిల్లా విద్యాధికారి శ్రీరామ్ మొండయ్య, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎన్సీసీ బటాలియన్ కమాండర్ ఏకె జయంత్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, రమేష్ రెడ్డి, డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ “అల్ఫోర్స్” వి. నరేందర్ రెడ్డి ఆత్మీయ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, “క్రీడలు యువతలో శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయి. ఒలింపిక్ స్ఫూర్తిని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లేలా ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలి” అని పేర్కొన్నారు.

# కల్వకుర్తిలో సుంకిరెడ్డి నిర్వహించ తలపెట్టిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన





**జూలై 5 నుంచి 13 వరకు సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో మెగా క్యాంప్**

**కల్వకుర్తి, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గం మరియు పరిసర ప్రాంతాల్లోని నిరుపేద ప్రజల కోసం సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. జూలై 5 (శనివారం) నుంచి 13 (ఆదివారం) వరకు కల్వకుర్తి హైదరాబాద్ రోడ్డులోని సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ శిబిరం నిర్వహించనున్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని ఐక్యత ఫౌండేషన్ మరియు శంకర నేత్రాలయ, చెన్నై సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, “గతంలో వెల్దండ, ఆమనగల్‌లో నిర్వహించిన రెండు శిబిరాల్లో దాదాపు 10 వేల మందికి పైగా హాజరయ్యారు. 8 వేల మందికి కంటి పరీక్షలు, 6 వేల మందికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేయగా, 290 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించాం. ఇప్పుడు మూడవ క్యాంప్‌ను కల్వకుర్తిలో నిర్వహిస్తున్నాం” అని తెలిపారు. మార్చాలా, యంగంపల్లి, జిల్లెళ్ళ, కుర్మిద్ద, పంజుగుల, ముకురాల, లింగాసానిపల్లి, గుండూరు, రఘుపతిపేట గ్రామాల్లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించగా, ప్రజల్లో మంచి స్పందన లభించింది. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమాల్లో బీసీ బాలరాజు, మాజీ సర్పంచ్ వెంకయ్య, భారతి సుధాకర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఎముక రవి, మాలిక్, మహేందర్, రమేష్, వినోద్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేణువాసు రెడ్డి, నాగరాజు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు యూసుఫ్ బాబా, గణేష్, శ్రీపతి, శేఖర్, శ్రీను, జాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**-అవార్డు గ్రహీత డాక్టర్ మిర్యాల వెంకటరమణను సన్మానించిన ఎమ్మెల్యే**



**షాద్ నగర్, జూన్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్లు ప్రజలకు మెరు గైన వైద్య సేవలు అందించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మిర్యాల వెంకటరమణ ఇటీవల ఉత్తమ డాక్టర్ గా అవార్డు అందుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ నేత కృష్ణారెడ్డి, సుదర్శన్ గౌడ్, మహమ్మద్ ఇబ్రహీం తదితరులు డాక్టర్ మిర్యాల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు చేస్తున్న మేలైన సామాజిక సేవలను గుర్తించడం శుభపరిణామన్నారు. దీంతో వైద్యులకు మరింత బాధ్యత పెరిగిందని, ప్రతీ రోగి డాక్టర్లను దేవుళ్లుగా భావించి వైద్యం కోసం వస్తుంటారని, అలాంటి వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైద్య వృత్తికి వన్నె తీసుకురావాలని కోరారు. డాక్టర్ ను సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు అగనూరు బస్సు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పార్లమెంటరీ నాయకులు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# భాగ్యనగర్‌లో బీజేపీ రచ్చబండకు విశేష స్పందన

**మోదీ పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమం**



**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలోని 56వ డివిజన్ భాగ్యనగర్‌లో బీజేపీ పశ్చిమ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం రచ్చబండ సమావేశం జరగగా, కార్యక్రమానికి ప్రజలు, కార్యకర్తలు విశేషంగా హాజరయ్యారు. ఈ సమావేశాన్ని శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు ఏన్నం ప్రకాష్, వరాల దేవేందర్ ముందుండి నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ నేత, కార్పొరేటర్ అభ్యర్థి శానగొండ శ్రీనివాస్ మాట్లాడుతూ, “నరేంద్ర మోదీ 11 ఏళ్ల సుపరిపాలనలో భారత్‌ను శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న మోదీ పాలనకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోంది” అని పేర్కొన్నారు. అదే సమావేశంలో మాజీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, “తెలంగాణలో టీఆర్ఎస్ పాలనను ప్రజలు తిరస్కరించగా, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హామీల అమలులో విఫలమైంది. రాష్ట్ర ప్రజలు కేంద్ర పాలన పట్ల విశ్వాసం పెంచుకుంటున్నారు” అన్నారు. ఏన్నం ప్రకాష్ మాట్లాడుతూ, “రాబోయే పురపాలక ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవాలంటే బూత్ స్థాయి నుంచి కార్యకర్తలంతా కృషి చేయాలి” అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బండారీ శ్రీనివాస్, కొంగల రాజిరెడ్డి, పాశం నరసింహారెడ్డి, గోలి సత్యనారాయణ రెడ్డి, గాదగోని రమేష్, ఆకారపు శ్రీనివాసరెడ్డి, దేవేందర్ రెడ్డి, రాజు, మెరుగు పరశురాము, వంగల రవీందర్, ముదిగంటి ప్రవీణ్, కుసుంబ ఆదర్శ్, మురళి మనోహర్, తాడూరి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# మొత్తానికి గోడెక్కిన మోడీ చిత్రం..

**రాసుమల్లెగూడా రేషన్ షాపులో మోడీ ఫోటో..**






**ఫరూక్ నగర్, జూన్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేంద్రం నిత్యవసరాలు ఇస్తుంటే రేషన్ షాపుల్లో మోడీ ఫోటో ఎందుకు పెట్టరు. ఈ విషయం పై ఢిల్లీలో కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ మొదలుకొని గల్లీ లీడర్ వరకు వేసే ప్రశ్న ఇది. ఈ ప్రశ్నకు మొత్తానికి కాంగ్రెస్ సమాధానం చెప్పింది. రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం రాసుమల్ల గూడ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపులో మోడీజీ ఫోటో కనిపించింది. పీఎం మోడీ, సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలు పక్కపక్కనే ఉండడం గమనార్హం. వీరి చిత్రాలతో పాటు సంబంధిత మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చిత్రాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ రేషన్ దుకాణాన్ని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం ప్రారంభించారు.

# చదువుకుంటేనే ప్రతి సమస్యకు సమాధానం దొరుకుతుంది

తప్పస్విని కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభోత్సవంలో – రమాదేవి



**వనపర్తి,జూన్ 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** విద్యఅనేది సమాజాన్ని మార్చడానికి ఒక ఆయుధంలా పనిచేస్తుందని మనకు ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి విద్య ఒక్కటే మార్గమని కాంగ్రెస్ నాయకురాలు రెండో వార్డు మాజీ కౌన్సిలర్ రమాదేవి అన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణము బ్రాహ్మణ వీధి 2 వార్డ్ నందు తపస్విని కిడ్స్ ప్లే స్కూల్ అండ్ డే కేర్ సెంటర్ ప్రారంభ కార్యక్రమానికి హాజరైన రమాదేవి పాఠశాల నిర్వాహకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి పూజా కార్యక్రమంము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గాంధీ చౌక్,పరిసర ప్రాంతాల్లో, పాత పట్టణంకావడంతో అక్షరాస్యత సరిగా లేనటువంటి తల్లిదండ్రులు, తమ పిల్లలను దూరప్రాంతాలకు పంపించి సరైన విద్యను,పొందలేక పోతున్నారనిఇది గమనించి ఈ పాఠశాల నిర్వాహకులు, చాలా చక్కటి వాతావరణంలో రంగురంగుల బొమ్మలతో, అన్ని రకాల ఆటవస్తుల సౌకర్యాలు కల్పించి, చిన్నారులకు ప్రీ ప్రైమరీ పాఠశాలను నెలకొల్పడం స్థానిక కౌన్సిలర్ గా నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ, సీనియర్ న్యాయవాది బాలయ్య యాదవ్, సీనియర్ పాత్రికేయుడు బండారు గోపాల్ హాజరైనారు వారిని నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, గోపీనాథ చారి, సుధాకర్ రెడ్డిలు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామ్ రెడ్డి, ఉపాధ్యాయినీలు, చిన్నారి బాల బాలికలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.


**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి కె.సి.ఆర్ కి అండగా నిలుద్దాం

ఘనపూర్ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**గణపురం,జూన్ 20:(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బి.ఆర్.ఎస్ ఘనపూర్ మండల ముఖ్య నాయకుల సమావేశం పార్టీ అధ్యక్షులు రాళ్ళ.కృష్ణయ్య స్వగృహంలో జరిగింది. ఇట్టి సమావేశంలో ముఖ్య అతిథిగానిరంజన్ రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి అని మండల నాయకులు గ్రామాలలో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని 19నెలల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి ప్రజలకు చేరువకావాలని పిలుపునిచ్చారు. ప్రజల మన్ననలను పొందిన నాయకులను గుర్తించి వారికి అవకాశం ఇవ్వాలని అన్నారు. పార్టీ పట్ల నిబద్ధత,నాయకుని పట్ల విశ్వాసం ఉన్న నాయకులకు పార్టీ అవకాశం ఇస్తుందని అన్నారు. పార్టీలో ఉంటూ ఇతర పార్టీలకు సహకరించే నమ్మకద్రోహుల పట్ల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్థిర నిర్ణయానికి వచ్చినారని కె.సి.ఆర్ హయాములో జరిగిన సంక్షేమం నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఎట్లా నిర్వీర్యం అయినాయో స్పష్టమైన అవగాహనతో ఉన్నారని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ వారికి అండగా నిలవాలని నిరంజన్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్,మాజీ మార్కెట్ ఛైర్మెన్ లక్ష్మారెడ్డి,మాజీ జడ్పిటిసి సామ్యా నాయక్ మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ బాలేశ్వర్ రెడ్డి, ఎస్.టి సెల్ జిల్లా నాయకులు జాత్రు నాయక్,మాజీ ప్రజాప్రతినిధులు,వివిధ గ్రామాల అధ్యక్షులు ,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి సిఐ గంగాధర్



**కడ్తాల్, జూన్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సైబర్ నేరాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కడ్తాల్ సిఐ గంగాధర్ అన్నారు. కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అధ్యక్షతన ఎర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కడ్తాల్ సిఐ గంగాధర్ మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసు కుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నా రన్నారు. విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అంతేకాక సైబర్ మోసాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చుట్టూ సమాజాన్ని విద్యార్థులు జాగృతం చేయాల న్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే 90 శాతానికి పైగా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతు న్నారన్నారు. వాటి కట్టడికి అప్రమత్తత ఒక్కటే మార్గమన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వైపు వెళ్తే జీవితాలు నాశనం అవుతాయన్నారు. విద్యార్థులు క్షణి క ఆవేశాలకు దూరంగా ఉండాల న్నారు. కార్యక్రమంలో ఎస్సై వరప్రసాద్, పోలీసులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# ముదిగొండ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమం

–బాల్య వివాహాలపై చైతన్యం, హెల్ప్‌లైన్ సమాచారం అందజేత



**ముదిగొండ, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముదిగొండ షెడ్యూల్డ్ ట్రైబ్ అడ్వాన్స్డ్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ గర్ల్స్‌లో శనివారం కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసిపిడిఓ అనురాధ మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మేనరికపు వివాహాల ప్రభావం, సేఫ్ టచ్ – అన్‌సేఫ్ టచ్, పోషకాహార లోపం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, మొబైల్ వినియోగం వల్ల కలిగే మానసిక ప్రభావాలు తదితర అంశాలపై విద్యార్థులకు చైతన్యం కల్పించారు. అలాగే ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు హెల్ప్‌లైన్ నెంబర్ల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ డి. చిట్టెమ్మ, ఐసిపిఎస్ ప్రతినిధి అంజలి, పల్లె వైద్యాధికారి డాక్టర్ సోనీ, ఏఎన్ఎం పార్వతి, స్కూల్ టీచర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ

-ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని అచ్చంపేటలో వినతిపత్రం



**అచ్చంపేట, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అచ్చంపేట శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మొక్తాల శంతన్ మాట్లాడుతూ, "అచ్చంపేట పట్టణంలో విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చారు. ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్నాయి. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం" అని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శులు గణేష్, విగ్నేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తవక్లాపూర్ పాఠశాల అభివృద్ధికి డాక్టర్ గుంత శ్రీనివాస్ విరాళం

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**దేవరకొండ, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తవక్లాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గుంత శ్రీనివాస్ తన సొంత ఊరిలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అభివృద్ధికి రూ.20 లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ప్రాంగణంలో గ్రామ పెద్దలు, ప్రజలు ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. తాను చదువుకున్న పాఠశాలకు సేవలందించడం ఎంతో గర్వకారణమని, గ్రామ విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేయడం ఆనందంగా ఉందని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, "ఇలాంటి గొప్ప మనసున్న మహోన్నత వ్యక్తులు గ్రామానికి గర్వకారణం. ఆయన సేవా దృక్పథం యువతకు ఆదర్శంగా నిలుస్తుంది" అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# వెల్దండలో తెలంగాణ దర్శిని కార్యక్రమం

ఐదో తరగతి విద్యార్థులకు చారిత్రక అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు




**వెల్దండ, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణ దర్శిని కార్యక్రమం కింద వెల్దండ మండల కేంద్రంలో వెల్దండ సోషల్ వెల్ఫేర్ గురుకుల (ఎస్సీ) బాలికల పాఠశాల ఆధ్వర్యంలో ఐదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ స్వర్ణ రత్న నేతృత్వంలో విద్యార్థులు మండల కేంద్రంలోని ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించి, రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, వారసత్వంపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలలిత, శ్వేత కుమారి, రక్షిత బేగం, సుజాత కుమారి, ఆర్.ఎల్. లత పాల్గొన్నారు. తెలంగాణ దర్శిని ద్వారా విద్యార్థులు పాఠశాల గదులకే పరిమితం కాకుండా ప్రత్యక్ష అనుభవాల ద్వారా నేర్చుకునే అవకాశాన్ని పొందుతున్నారని నిర్వాహకులు తెలిపారు.


# జ్యోతినగర్ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న బండి సంజయ్ దంపతులు

## శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జ్యోతినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న పంచమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన సతీమణితో కలిసి శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేద మంత్రోచ్చారణల మధ్య పూజారులు బండి సంజయ్ దంపతులకు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండి రమణారెడ్డి, పలువురు బీజేపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత



**నారాయణఖేడ్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖేడ్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి అందజేశారు. కల్హేర్ మండలంలోని పొమ్యానాయక్ తాండాకు చెందిన కె. రమేష్ కు రూ,8,500లు,కంగ్టి మండలంలోని డి. బాన్సువాడకు చెందిన నాగమణికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ, 25,500ల చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి,లక్ష్మన్ నాయక్, వెంకట్ నాయక్, రాంసింగ్,యాదయ్య, మాణిక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఆమనగల్లు మున్సిపాలిటీలో గర్భిణీ స్త్రీలకు ఉప్పల ట్రస్ట్ సేవా కార్యక్రమం

## ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో 8 వార్డుల్లో ఉచిత మెడికల్ కిట్ల పంపిణీ




**ఆమనగల్లు, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు నుంచి 8వ వార్డు వరకు గర్భిణీ స్త్రీలకు ఉచిత మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ట్రస్ట్ చైర్మన్ మరియు తెలంగాణ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ గారి సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, “తల్లి–బిడ్డల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెడికల్ కిట్ల పంపిణీ చేపట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలన్నదే ట్రస్ట్ లక్ష్యం” అని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు అవసరమైన ఔషధాలు, పోషక పదార్థాలు, హైజీన్ కిట్లు ఈ పంపిణీలో భాగంగా అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ అనురాధ పత్యా నాయక్, నాగిళ్ళ జగన్, వరికుప్పల గణేష్, బయ్యా దేవేందర్, రేపని శివ, శ్రీశైలం, పల్లె గిరి, వసుపుల రవి, కిషోర్ నాయక్, వరికుప్పల నిరంజన్, కాలే విక్రమ్, విమలమ్మ, లలితమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ లక్ష్యంగా కేసీఆర్ హయాంలో ఫోన్ ట్యాపింగ్





-సిట్ విచారణలో వెల్లడి
-ప్రవీణ్ రావు ఫోన్ ట్యాప్ నిర్ధారణ
-నోటీసులు ఇస్తాం..
వాంగ్మూలానికి సిద్ధంగా ఉండాలన్న పోలీసులు



**హైదరాబాద్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బీజేపీ నేత బండి సంజయ్ ను లక్ష్యంగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్ విచారణలో ఒక్కొక్కటిగా నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా బండి సంజయ్ సన్నిహితుడు, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఆయనకు ఫోన్ చేసి, “మీ ఫోన్ ట్యాప్ చేశారు. విచారణకు హాజరుకావాల్సి ఉంటుంది. త్వరలో నోటీసులు పంపిస్తాం” అని తెలిపారు. ప్రవీణ్ రావు గత రెండు దశాబ్దాలుగా బండి సంజయ్ వెన్నంటి ఉండి, ఆయన రాజకీయ కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 317 జీవో, టెన్త్ పేపర్ లీకేజీ, భైంసా అల్లర్లు, శాతవాహన యూనివర్సిటీ ఆందోళనలు వంటి అనేక ఘటనల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. బండి సంజయ్ పై కేసీఆర్ హయాంలో 100కు పైగా కేసులు నమోదు కాగా, ఆయన ఫోన్‌తో పాటు కుటుంబ సభ్యులు, సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు సిట్ విచారణలో అవి నిజమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రవీణ్ రావుతో పాటు బండి సంజయ్ సిబ్బందికి కూడా త్వరలో నోటీసులు జారీ చేసి విచారణకు పిలవనున్నట్లు సమాచారం.

# ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: పిడిఎస్యు

## -కల్వకుర్తిలో ఎంఈఓకు వినతిపత్రం సమర్పించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్



**కల్వకుర్తి, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో ఎంఈఓ కార్యాలయానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కల్వకుర్తిలో అనుమతి లేకుండా పాఠశాలలు నడుస్తున్నాయి. ఒక పేరుతో గుర్తింపు తీసుకుని, మరో పేరుతో బోర్డు పెట్టి విద్యా వ్యవస్థను మోసం చేస్తున్నారు. ఫైర్ సేఫ్టీ, మైదానం, మౌలిక వసతులు లేని స్కూళ్లు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయి” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎంఈఓ స్పందించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాయి చరణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్చార్జి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

## జిల్లా అభివృద్ధిపై మంత్రి తుమ్మలతో చర్చ



**హైదరాబాద్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి సచివాలయంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రి తుమ్మలతో జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, రైతుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. జిల్లా ప్రగతికి సమిష్టిగా కృషి చేయాలని మంత్రి సూచించినట్లు సమాచారం.

# రైతుల అకౌంట్లపై హోల్డ్ తొలగించాలి

## – కాంగ్రెస్ నేత విజయ్ కుమార్ రెడ్డి
## -కల్వకుర్తిలో ఎస్బీఐ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పణ



**కల్వకుర్తి, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతుల పంటల పెట్టుబడుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నిధులను బ్యాంకులు హోల్డ్‌లో పెట్టడం సరికాదని అభిప్రాయపడుతూ, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, “ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.12,000 చొప్పున నిధులు మంజూరు చేస్తోంది. అయితే పాత బకాయిల పేరిట బ్యాంకులు రైతుల అకౌంట్లను హోల్డ్‌లో పెట్టడం వల్ల వారు పెట్టుబడి లేక వ్యవసాయం మానేసే పరిస్థితి ఏర్పడుతోంది. కొందరు అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు” అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం నేరుగా అకౌంట్లలో నిధులు జమ చేస్తే, బ్యాంకులు సహకరించకపోతే రైతులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. వెంటనే హోల్డ్‌లో ఉన్న అకౌంట్లను విడుదల చేయాలని, లేకపోతే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీసీ బాలరాజు, మార్చాల గ్రామ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, జంగయ్య, పాండు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌కు చైనా జే-35 స్టెల్త్ ఫైటర్ జెట్స్

## భారత్ వద్ద ఇలాంటి యుద్ధ విమానాల్లేవ్



**న్యూఢిల్లీ, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చైనా గత ఏడాది నవంబర్‌లో ఆవిష్కరించిన 40 జే–35 యుద్ధ విమానాలను పాకిస్థాన్‌కు అందించనుంది. అత్యంత వేగంగా పయనించే ఈ ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్‌లను రాడార్ లేదా సోనార్ వ్యవస్థల ద్వారా కనుగొనడం అత్యంత కష్టతరం. ఇటువంటి విమానాలున్న అతికొద్ది దేశాల సరసన పాక్ చేరింది. భారత్ వద్ద ప్రస్తుతానికి ఇంతటి అధునాతన యుద్ధ విమానాలు లేవు.జే–35 యుద్ధ విమానాలు అమెరికా వద్దనున్న అత్యంత ఖరీదైన ఎఫ్–35తో సమానమని చైనాకు చెందిన గ్లోబల్ టైమ్స్ వార్తా సంస్థ తెలిపింది. రెండు ఇంజిన్లు, ఒకే సీటు ఉండే జే–35లో అత్యంత అధునాతన వ్యవస్థను అమర్చినట్టు పేర్కొంది. ఇంతవరకు ఏ యుద్ధంలోనూ ఈ విమానాన్ని వినియోగించనందున దీని సామర్థ్యంపై ఎటువంటి వివరాలు అందుబాటులో లేవు. ఈ విమానాల కొనుగోలుతో పాక్ గగనతల యుద్ధతంత్రంలో భారత్‌పై పైచేయిగా ఉండగలదని నిపుణులు పేర్కొంటున్నారు.

# తాటి చెట్టు పై నుండి నేల రాలిన గౌడన్న

## మృత్యు ఒడిలో చెంగల సురేష్



**వర్ధన్నపేట, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** :వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి చెందిన చెంగల సురేష్ రోజు వారి కులవృత్తు లో భాగంగా శుక్రవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందాడు నిరుపేద కుటుంబానికి చెందిన సురేష్ కి ఇద్దరు అన్నలు తల్లిదండ్రులు వున్నారు వీరిని ప్రభుత్వమే ఎలాగైనా సహాయం అందించాలని గ్రామం లోని వారు కోరుతున్నారు.సురేష్ మృతి చెందడం తో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.